యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నూతనంగా యాదవ సంఘం కమిటీ సభ్యులు

కోనరావుపేట, డిసెంబర్ 1: మండలంలోని ధర్మారం గ్రామంలో యాదవ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అసరి అంజయ్య, ఉపాధ్యక్షుడిగా ఆసరి తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా ఆసరి రాజయ్య, మమతను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను సర్పంచ్ గున్నాల అరుణ అభినందించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత

ఇల్లంతకుంట, డిసెంబర్ 1 : మండల కేంద్రానికి చెందిన రొడ్డ శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతుండగా పలువురు ఆర్థిక సహాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పంక్చర్ షాప్ దుకాణ యజమానులు బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల కేంద్రంలో బాధిత కుటుబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పంక్చర్ షాప్ యజమానులు

సిరిసిల్లలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరిన మహిళలు (ఫైల్)

మహిళా చైతన్యం

పోలింగ్ శాతం
సిరిసిల్ల 77%
వేములవాడ 78%

ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో అతివలే అధికం

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో మహిళలు తమ సత్తా చాటారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్యలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు. మొత్తం జిల్లాలో 4,66,677 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 2,26,553, మహిళలు 2,40,087 మంది ఓటర్లు ఉన్నారు. జరిగిన ఎన్నికల్లో మొత్తం 3,62,517 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా అందులో పురుషులు 1,68,390, మహిళలు 1,94,115 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 25,725 మంది మహిళలు పురుషుల కన్నా అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 77శాతం, వేములవాడ నియోజక వర్గంలో 78.43 పోలింగ్ శాతం నమోదైంది. గత 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం సిరిసిల్ల నియోజకవర్గంలో 80.57శాతంతో నమోదు కాగా, 3 శాతం తగ్గింది. వేములవాడ నియోజకవర్గంలో 80.41శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 2 శాతం పోలింగ్ తగ్గింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 50శాతం పోలింగ్ జరగగా, అనంతరం 5 గంటల వరకు పెద్ద ఎత్తున ఓటర్లు తరలి వచ్చారు. కొన్నిచోట్ల రాత్రి ఏడు గంటల వరకు ఓటింగ్ నిర్వహించారు. వృత్తి, ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు కొంత మంది స్థానికులు సొంతూళ్లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేక పోయారు. దీంతో పోలింగ్ శాతం గతంలో కన్నా కొంచెం తగ్గినట్లు అధికారులు తెలిపారు.

చకచకా నాలుగు లైన్ల బీటీ రోడ్డు పనులు

రుద్రంగిలో చివరి దశకు చేరుకున్న నాలుగు లైన్ల బీటీ రోడ్డు పనులు

రుద్రంగి, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో జరుగుతున్న నాలుగు లైన్ల బీటీ రోడ్డు పనులు చకచకా సాగుతున్నాయి. గతంలో రుద్రంగి మండల కేంద్రంలో గతుకుల రోడ్డుతో ఇబ్బందులు పడ్డ ప్రజలు, వాహనదారులకు ఇక నుంచి ప్రయాణ బాధలు తప్పనున్నాయి. మండల కేంద్రంలోని 1,100 మీటర్ల పొడవుతో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరాచౌక్ వరకు నాలుగు లైన్ల బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక కృషితో రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేయగా రోడ్డు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా రోడ్డు, డివైడర్ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. నాలుగు లైన్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండటంతో వాహనదారులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థి ప్రతిభ

చొప్పదండి, డిసెంబర్ 1 (రామడుగు): మంథనిలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థి ఎం కార్తికేయ ప్రతిభ కనబర్చినట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో కరీంనగర్ జిల్లా తరపున పాల్గొన్న కార్తికేయ ప్రతిభ కనబర్చి రెండోస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన కార్తికేయను శుక్రవారం ఆయన అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

ఘనంగా నవగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

పూజల్లో పాల్గొన్న వ్యవస్థాపక ధర్మకర్తలు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 1 : జిల్లా కేంద్రంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంలో నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్థాపిత దేవతా పూజలు, హోమాలు, సాయంత్రం ధాన్య, ఫల, పుష్ప, శయ్యాధివాసాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం యంత్ర, విగ్రహ ప్రాణప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు ప్రకాశ్, కొండయ్య, లక్ష్మయ్య, ఈవో మారుతి, అర్చకులు, సిబ్బంది గుడికాడి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

సందడి లేని తహసీల్దార్ కార్యాలయం

ఎల్లారెడ్డిపేటలోని ఎంపీడీవో కార్యాలయం

వెలవెలబోయిన కార్యాలయాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 1: నిత్యం ఏదో పని మీద వచ్చే జనంతో సందడిగా ఉండే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు శుక్రవారం ఎన్నికల విధుల్లో అధికారులు బిజీబిజీగా ఉండటంతో వెలవెలబోయాయి. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రోస్, బీఎస్పీ పార్టీ కార్యాలయాలు నెల రోజులు నిత్యం ప్రచారం కోసం వచ్చే నాయకులు, అనుచరులతో కిక్కిరిసి ఉండగా గురువారం పోలింగ్ ముగియడంతో కార్యకర్తలు కనిపించలేకుండా పోయారు. ఎన్నికల వేడి తగ్గిపోవడంతో జనం ఎవరి పనుల్లో వారు బిజీ అయ్యారు.

జిల్లా సెంట్రింగ్ ఓనర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

వేములవాడ, డిసెంబర్ 1: రాజన్న సిరిసిల్ల జిల్లా సెంట్రింగ్ ఓనర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నికను శుక్రవారం వేములవాడలో నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో ఎన్నికైన ఈ కార్యవర్గంలో గౌరవాధ్యక్షుడిగా గాజుల పోశెట్టి, అధ్యక్షుడిగా ఎల్ల స్వామి, ప్రధాన కార్యదర్శిగా కోరెపు శ్రీనివాస్, కోశాధికారిగా పార్లపల్లి అంజి, కార్యదర్శిగా శీలం రవి, సభ్యులుగా వావిలాల శ్రీకాంత్, సింగారపు స్వామి, ఎల్ల దేవరాజు, చింతపంటి కమలాకర్, డప్పు శ్రీనివాస్ ఎన్నికైనట్టు వారు తెలిపారు.